ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలి

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆలేరు మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆలేరు రూరల్/మోటకొండూరు, ఏప్రిల్ 10 : రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఆలేరు మార్కెట్ యార్డులో, కొలనుపాకలో, మోటకొండూర్ మండల కేంద్రంతోపాటు అమ్మనబోలులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. అనంతరం అమ్మనబోలులో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమాల్లో జడ్పీ సీఈఓ శోభారాణి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఐనాల చైతన్యామహేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మొగులగాని మల్లేశ్‌గౌడ్, తాసీల్దార్లు నాగదివ్య, అంజిరెడ్డి, ఎంపీడీఓలు సత్యాంజనేయప్రసాద్, ఇందిర, ఏఓలు రమాదేవి, శ్రీనివాస్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎగ్గిడి బాలయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మధార్‌గౌడ్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

పల్లివాడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట, ఏప్రిల్ 10 : ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని పల్లివాడ గ్రామంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం మునిపంపుల గ్రామంలో సన్న బియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు.

కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, తాసీల్దార్ లాల్ బహదూర్, ఎంపీడీఓ యాకూబ్‌నాయక్, ఏఓ ఏజాజ్ అలీఖాన్ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో జడ్పీ సీఈఓ శోభారాణి పర్యటన

పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ శోభారాణి

మోటకొండూర్, ఏప్రిల్ 10 : మండలంలోని పలు గ్రామాల్లో జడ్పీ సీఈఓ శోభారాణి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో పీహెచ్‌సీలోని రికార్డులను, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం కదిరేణిగూడెంలో ముగ్గ పోస్తున్న ఇందిరమ్మ ఇండ్లను సందర్శించారు. ప్రభుత్వ అధికారులు సమయపాలన పాటించాలని సూచించారు. ఆమె వెంట తాసీల్దార్ నాగదివ్య, ఎంపీడీఓ ఇందిర, మండల వైద్యాధికారి విజయ్, పంచాయతీ కార్యదర్శి బొట్ల శ్రీకాంత్ ఉన్నారు.

దారి కోసం ధర్నా

తాసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న బంటుగూడెం గ్రామస్తులు

రాజాపేట, ఏప్రిల్ 10 : మండల కేంద్రంలోని బంటుగూడేనికి వెళ్లే దారి మూసేస్తున్నారని గ్రామస్తులు గురువారం తాసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇదే దారి గుండా నాలుగు తరాల నుంచి వెళ్తున్నామని, ఇప్పుడు కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు చుట్టూ ముళ్ల కంచె వేసి దారి మూసేస్తున్నారని తెలిపారు. గూడేనికి వెళ్లే దారి మూసేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తాసీల్దార్ అనితకు వినతి పత్రం అందజేశారు.

నర్సమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన

ధర్నా చేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

మోటకొండూర్, ఏప్రిల్ 10 : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గుడ్డెటి నర్సమ్మ (60) కుటుంబానికి న్యాయం చేయాలని మండలంలోని కొండాపురంలో మోత్కూరు – రాయగిరి రహదారిపై ఆమె కుటుంబ సభ్యులతో కలిసి గ్రామస్తులు గురువారం ధర్నా చేపట్టారు. ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాతో ట్రాఫిక్ జామ్ కావడంతో ఘటనా స్థలానికి ఏసీపీ రమేశ్, పోలీస్ సిబ్బంది చేరుకొని ఆందోళనకారులకు సర్దిచెప్పి ధర్నా విరమింపజేశారు.

మంచినీటి ట్యాంకుల నిర్మాణం పూర్తి చేయాలి : ఎస్ఈ

మంచినీటి ట్యాంకు పనులను పరిశీలిస్తున్న పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వర్లు

మోత్కూరు, ఏప్రిల్ 10 : మున్సిపాలిటీలో అమృత్ 2.0 స్కీం కింద మంజూరైన నిధులతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలోని మంచినీటి సరఫరా ట్యాంకుల నిర్మాణాన్ని పూర్తి చేయాలని పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని ట్యాంకు నిర్మాణ పనులు, బీటీ డబుల్ రోడ్డు, కల్వర్టుల నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. అధికారులు నిత్యం పర్యవేక్షణ చేసి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఈ మనోహర, ఏఈ సురేశ్, మున్సిపల్ కమిషనర్ సతీశ్‌కుమార్, మేనేజర్ ప్రభాకర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వెంకటయ్య, లక్ష్మీనర్సింహారెడ్డి పాల్గొన్నారు.

వంట గ్యాస్ ధరలు తగ్గించాలని మహిళల నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 10 : పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని 9, 26వ వార్డుల్లో గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని గురువారం సీపీఎం ఆధ్వర్యంలో మహిళలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడా కార్పొరేట్ సంస్థలకు మాఫీ చేస్తూ పేదలపై భారం మోపడం సరికాదన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దండు గిరి, చింతల సత్యనారాయణ, మన్నె రాజు, లలిత, లక్ష్మి, రాణి, జంగమ్మ, మంగ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించాలి : సీపీఎం

మోత్కూరు, ఏప్రిల్ 10 : కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. మండలంలోని పాలడుగు గ్రామం వద్ద జాతీయ రహదారిపై గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల పేదలు బతుకలేని దుస్థితి ఏర్పడిందన్నారు. సిలిండర్‌పై రూ.50 పెంచడం వల్ల తీవ్ర ఆర్థిక భారం పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, గంగయ్య, యాదగిరి, సోమరాజు, సైదులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వినతి

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 10 : పట్టణంలోని ప్రధాన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ కోరారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్ అండ్ బీ సూపరింటెండెంట్ కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీపీఐ జిల్లా సమితి సభ్యుడు శ్రీధర్, మండల కార్యదర్శి మహేందర్ పాల్గొన్నారు.

అకాల వర్షంతో ఆగమాగం

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

ఆత్మకూరు(ఎం)లో కొట్టుకుపోయిన ధాన్యం

మోత్కూరు వ్యవసాయ మార్కెట్‌లో వర్షపు నీటిలో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని కుప్ప చేస్తున్న మహిళా రైతు

మోత్కూరు, ఏప్రిల్10 : జిల్లా వ్యాప్తంగా గురువారం ఈదురు గాలులతో కురిసిన అకాల వర్షం అన్నదాతను ఆగమాగం చేసింది. మోత్కూరు మండలంలో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వ్యవసాయ మార్కెట్‌తోపాటు మండలంలోని పాటిమట్ల, దాచారం, సదర్శాపురం, ముశిపట్ల గ్రామాల్లోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. చేతికి అందివచ్చిన పంటలు ఈదురు గాలులకు నేలపాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాచారం, అనాజిపురం, పాటిమట్ల, మోత్కూరు, ముశిపట్ల, పొడిచేడు, సదర్శాపురం గ్రామాల్లో ఈదురు గాలులకు మామిడి కాయలు నేలరాలాయి. అకాల వర్షం తమను అతలాకుతలం చేసిందని అనాజిపురానికి చెందిన రైతు కొల్లు శంకరయ్య వాపోయారు. చేతికి అందివచ్చిన వరి పంట నేల పాలైందని మోత్కూరుకు చెందిన రైతు ఎండీ ఖాజమియా తెలిపారు. రెండు మూడు రోజుల్లో కోయాల్సిన పొలం గాలితో కూడిన వర్షం రావడంతో నేలపట్టి ధాన్యం రాలిపోయిందని కంటనీరు పెట్టారు.

భువనగిరి కలెక్టరేట్ : ఒక్కసారిగా కురిసిన అకాల వర్షంతో జిల్లాలోని ఆత్మకూరు(ఎం), మోత్కూరు, భువనగిరి, సంస్థాన్ నారాయణపురం, గుండాల, అడ్డగూడూరు, ఆలేరు, వలిగొండ, చౌటుప్పల్ మండలాల్లో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. చేతికంది వచ్చిన పంట నేలకొరిగింది. మామిడి కాయలు నేలరాలాయి. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది.

పిడుగు పాటుకు గురై గేదె మృతి

ఆలేరు రూరల్ : మండలంలోని మంతపురి గ్రామానికి చెందిన పల్లా రాజిరెడ్డి తన వ్యవసాయ బావి వద్ద చెట్టుకు గేదెను కట్టేశాడు. గురువారం సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం పిడుగు పడడంతో గేదె మృతి చెందింది. దాని విలువ రూ.50వేలకు పైగా ఉంటుందని బాధితుడు తెలిపారు.

మదర్ డెయిరీలో సయోధ్య కుదిరినట్టేనా?

- మూడ్రోజులపాటు అవిశ్వాసం అంటూ హంగామా
- డైరెక్టర్లతో ఎమ్మెల్యే బీర్ల సమావేశంతో మారిన సీన్
- అంతా ఒక్కటే అన్నట్లు మీడియా సమావేశంతో డ్రామా
- చైర్మన్‌పై స్వపక్షంలోనే ఆరోపణలు ఉన్నా పట్టింపేది?

హయత్‌నగర్‌లోని మదర్ డెయిరీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో చైర్మన్, డైరెక్టర్లు

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార యూనియన్ లిమిటెడ్ (మదర్ డెయిరీ)లో చైర్మన్, డైరెక్టర్ల మధ్య వివాదం ఆదిలోనే ఆగిపోయింది. రహస్య సమావేశం నిర్వహించి.. నార్ముల్ చైర్మన్‌పై గుర్రుగా ఉన్న డైరెక్టర్లు గంటల్లోనే చల్లబడ్డారు. అవిశ్వాసం అంటూ చేసిన హంగామా మూడ్రోజుల ముచ్చటగానే మారిపోయింది. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో సమావేశం తర్వాత సీన్ మారిపోయింది. అంతా ఒక్కటే అన్నట్లు మదర్ డెయిరీలో మీడియా సమావేశం నిర్వహించి.. ఏదో కథ అల్లే ప్రయత్నం చేశారు.

మదర్ డెయిరీలో 297 మంది పాల సంఘం చైర్మన్లు ఉన్నారు. అత్యధికంగా ఆలేరు, భువనగిరి నియోజకవర్గాల్లోనే ఉండటం విశేషం. ఆరు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ చేజిక్కించుకుంది. చైర్మన్‌గా గుడిపాటి మధుసూదన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత కొద్దికాలానికే ఆయనపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. డెయిరీలో మొత్తం 15 మంది డైరెక్టర్లు ఉండగా, ఆయన మినహా అందరూ వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో మూడ్రోజుల క్రితం డైరెక్టర్లు రహస్య సమావేశం నిర్వహించారు. ఫొటోలు సైతం బయటకు వచ్చాయి. దీనిపై అంతటా చర్చ జరిగింది.

మూడ్రోజుల ముచ్చటగా..

'మదర్ డెయిరీలో అవిశ్వాసం తీర్మానానికి రంగం సిద్ధం, చైర్మన్ మార్పు తథ్యం' అంటూ ఇటీవల జోరుగా ప్రచారం జరిగింది. అవిశ్వాసం వార్తలు పెద్ద ఎత్తున ప్రచారం కావడంతో కాంగ్రెస్ పార్టీ దిద్దుబాటు చర్యలు ప్రారంభించింది. స్వయంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య రంగంలోకి దిగారు. పార్టీకి జరుగుతున్న డ్యామేజీని కంట్రోల్ చేసే చర్యలకు పూనుకున్నారు. బుధవారం యాదగిరిగుట్టలోని తన నివాసంలో డైరెక్టర్లతో సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. సెప్టెంబర్ వరకు ప్రస్తుత చైర్మన్‌ను కొనసాగిద్దామని, ఆ తర్వాత నిర్ణయం తీసుకుందామనే చర్చ జరిగినట్లు తెలిసింది. దీంతో అవిశ్వాసం లొల్లి మూడ్రోజుల ముచ్చటగానే ముగిసిపోయింది. అయితే సభ్యుల మధ్య ముడుపుల ఒప్పందాలు జరిగాయనే ఆరోపణలు కూడా బహిరంగంగా వినిపిస్తున్నాయి. గురువారం హయత్‌నగరలోని మదర్ డెయిరీ ప్రధాన కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి.. మేం అంతా ఒక్కటే అన్నట్లు సీన్ క్రియేట్ చేయడం కొసమెరుపు.

స్వపక్షంలో ఆరోపణలు ఉన్నా ..

డెయిరీ చైర్మన్‌పై స్వపక్షంలో పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఇవి బహిరంగంగానే వినిపించాయి. ఆధిపత్య పోరు, ఒంటెత్తు పోకడలు, సమన్వయలోపం, ఇష్టారాజ్యం తీరు అంటుంచితే.. అవినీతి ఆరోపణలు కూడా వచ్చాయి. గతంలో పాడి రైతులు డెయిరీకి పెద్ద ఎత్తున పాలు పోసేవారు. కానీ.. ఇటీవల కాలంలో బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో మదర్ డెయిరీకి ఆసక్తి చూపించడంలేదు. దీంతో వేరే సంస్థ నుంచి డెయిరీకి పాలను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. ఇలా రోజుకు 40వేల లీటర్లకు పైగా కొంటున్నారు. ఓ సంస్థ నుంచి ఇంత పెద్ద మొత్తంలో సరఫరా చేస్తుండటంతో చైర్మన్ ఆమ్యామ్యాలకు పాల్పడుతున్నారనే ప్రచారం ఉంది. ఒక లీటరుకు రూ.2 పైగా కమీషన్ తీసుకున్నారని లోకం కోడై కూస్తున్నది. ఇలా ఒక్కరోజే లక్షన్నర దాకా పక్కనేసుకుంటున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇలా అనేక విషయాల్లో 'తనకేంటి' అన్న విధంగా వ్యవహరిస్తున్నారని ఉద్యోగులే ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే నష్టాల్లో కూరుకుపోయిన సంస్థను మరింత ఆగం చేస్తున్నారనే ఆగ్రహంతో అంతా గుర్రుగా ఉన్నట్లు సమాచారం.

పాలిటెక్నిక్ కాలేజీలో ఉద్యోగ మేళా

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 10 : హిందూస్తాన్ కోకాకోలా బేవరేజస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ మేళాకు 79మంది విద్యార్థినులు హాజరయ్యారని, ఎంపిక ప్రక్రియ నాలుగు దశల్లో జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆప్టిట్యూడ్ ఆన్‌లైన్ పరీక్ష, పీడీటీ పరీక్ష, గ్రూప్ టాస్క్, ఎన్ఎంటీ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఈ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ మహిళా విద్యార్థినులకు ఉపాధి అవకాశాలు అందించడంలో ముఖ్య పాత్ర పోషించిందన్నారు. విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య అనుసంధానాన్ని బలపరిచే కార్యక్రమంగా నిలిచిందని పేర్కొన్నారు. కంపెనీ రిక్రూట్‌మెంట్ బోర్డు ఎస్ఆర్ కుమారస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాస్ దరఖాస్తులను గ్రామపంచాయతీల్లో అందించాలి

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 10 : రాజీవ్ యువ వికాస్ పథకం కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా చేసుకున్న దరఖాస్తులను గ్రామపంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 14వ రకు అందించాలని ఎంపీడీఓ రాములునాయక్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీవ్ యువ వికాస్ దరఖాస్తుదారులకు ఈ నెల 15నుంచి మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాను పంచాయతీ కార్యదర్శులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి నివేదికను ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎంపీఓ పద్మావతి, సూపరింటెండెంట్ లోకేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

యువ వికాసం దరఖాస్తులుచేసుకోవాలి

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 10 : రాజీవ్ యువ వికాసం పథకానికి ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. టార్గెట్ కంటే తక్కువ మంది దరఖాస్తు చేసుకున్నందున అర్హత ఉన్నవారు ఈ నెల 14లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చౌటుప్పల్ : రాజీవ్ యువ వికాస్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నర్సింహారెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఈ పథకంపై వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, మెప్మా రిసోర్స్ పర్సన్లతో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. దరఖాస్తు పత్రాలను కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

'దళారులకు ధాన్యం విక్రయించవద్దు'

అడ్డగూడూరు, ఏప్రిల్ 10 : రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించవద్దని తాసీల్దార్ శేషగిరిరావు అన్నారు. మండలంలోని కోటమర్తి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యమైన ధాన్యం తెచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి, డైరెక్టర్లు సోమన్న, విద్యాసాగర్, సింగిల్‌విండో డైరెక్టర్ భిక్షం, నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ అభియాన్

బొమ్మలరామారం, ఏప్రిల్ 10 : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి మాట్లాడుతూ సరైన పోషకాహారం తీసుకోవడం, పరిశుభ్రత పాటించడంతో అనారోగ్యాల బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు తేజ, మంజుల పాల్గొనారు.

పోషణ పక్షం కార్యక్రమాలను విజయవంతం చేయాలి : కలెక్టర్

పోషణ పక్షం పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 11 : పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేసి భద్రపరుచాలని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలోని మినీ మీటింగ్ హాల్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి పోషణ పక్షం పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 8నుంచి 22వరకు నిర్వహించే పోషణ పక్షం కార్యక్రమాన్ని సమర్థవంతంగా చేపట్టాలన్నారు. షెడ్యూల్ ప్రకారం రోజు వారీ కార్యక్రమాలు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించాలని, కార్యక్రమాల ఫొటోలను డాష్‌బోర్డులో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. జిల్లాను రాష్ట్రంలో ముందు వరుసలో ఉంచేందుకు ప్రతిఒక్కరూ పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, డీఎంహెచ్‌ఓ మనోహర్, డీపీఓ సునంద, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ యాదయ్య, డీపీఆర్‌ఓ అరుంధతి, జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారులు, పోషణ అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు.

బునాదిగాని కాల్వ నిర్మాణానికి స్థల సర్వే

- తమ భూమి నుంచి కాల్వ వద్దని అడ్డుకున్న రైతులు

పాటిమట్లలో సర్వే చేస్తున్న అధికారులు

మోత్కూరు, ఏప్రిల్ 10 : మండలంలోని పాటిమట్ల నుంచి అడ్డగూడూరు మండలంలోని ధర్మారం చెరువు వరకు బునాదిగాని కాల్వ నిర్మాణం చేపట్టాల్సి ఉండగా.. స్థల సేకరణ కోసం గురువారం అధికారులు సర్వే చేయడానికి వచ్చారు. వారిని రైతులు అడ్డుకున్నారు. కోట్ల విలువ చేసే తమ భూమిలో నుంచి కాల్వ తీయవద్దని గ్రామానికి చెందిన చల్లా స్వామి, లక్ష్మితోపాటు మరి కొందరు అడ్డుతగిలారు. గతంలోనూ స్థల సేకరణ కోసం అధికారులు వస్తే అడ్డుకోవడంతో వెళ్లిపోయారని, మళ్లీ ఇప్పుడు వచ్చారని, తమకు అన్యాయం చేసి కాల్వ తవ్వితే తమకు చావే శరణ్యమని రైతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం భూమిని సర్వే చేసేందుకు వచ్చామన్నారు. సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని, తమ అభిప్రాయాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ సుమన్, సర్వేయర్ సుష్మ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి : సీపీఎం

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 10 : తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దాసరి పాండు అన్నారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రిజర్వేషన్ల పేరుతో స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేయడం సరికాదన్నారు. వెంటనే రిజర్వేషన్ల సమస్యలు పరిష్కరించి ఎన్నికలు నిర్వహించాలని కోరారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం, జిల్లా నాయకుడు రచ్చ గోవర్ధన్, గ్రామ శాఖ కార్యదర్శి రాచమల్ల సత్తయ్య, సత్యనారాయణరెడ్డి, మల్లయ్య, పాపయ్య పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

- భార్య మృతి వార్త తెలిసి భర్త ఆత్మహత్యాయత్నం.. పరిస్థితి విషమం

రామన్నపేట, ఏప్రిల్ 10 : వరకట్న వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలిసిన ఆమె భర్త ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని నిధానపల్లి గ్రామంలో గురువారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం నిధానపల్లి గ్రామానికి చెందిన జినుకల అంజనేయులుతో చిట్యాల పట్టణానికి చెందిన కావ్య(29)కు 2018 నవంబర్‌లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. కాగా, వారం రోజుల నుంచి భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 8న ఆంజనేయులు కావ్యను కొట్టి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో మనస్థాపం చెందిన కావ్య గురువారం ఉదయం తన వ్యవసాయ బావి వద్ద పశువుల కొట్టంలోని ఇనుపరాడ్డుకు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. భార్య ఆత్మహత్య విషయం తెలుసుకున్న ఆంజనేయులు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు.

కావ్య తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ మల్లయ్య తెలిపారు.

యాదగిరి సేవలు మరువలేనివి : గొంగిడి సునీత

గుండాల, ఏప్రిల్ 10 : బీఆర్ఎస్ పార్టీకి ఆకునూరి యాదగిరి చేసిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. గుండాల మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఆకునూరి యాదగిరి అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. ఆయన భౌతికదేహం వద్ద సునీత పూలమాల ఉంచి నివాళి అర్పించారు. నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు ఎండీ ఖలీల్, నాయకులు బాలు, కొమురయ్య, చెన్నయ్య, గురుమూర్తి, రంజిత్‌రెడ